# ఎవరి సంకల్పం

కాఫీ తాగుతూ ఆలోచించాను. సాయంత్రం కాలేజి నుండి రాగానే నాన్నకు అంతా చెప్పాలి. ఈ రెండుమూడు నెలలనుండి నాన్నగారు నా పెళ్ళి ప్రసక్తి నాలుగైదుసార్లు ఎత్తారు. తొందరేమొచ్చిందని ఏదో ఒక సాకుపెట్టి తప్పించుకొనేవాడ్ని. కిందటి ఆదివారము మళ్ళీ ఆ ప్రస్తావన వచ్చేసరికి పరీక్షలయ్యేవరకు పెళ్ళి మాటవద్దని ఖచ్చితంగా చెప్పేశాను. కాని నిన్న శ్రీదేవిని కలుసుకున్నాక నా నిర్ణయం తారుమారయింది. ఆమె తల్లి తన పెళ్ళికి ఏదో సంబంధం కుదుర్చుతుందట. పరీక్షలయిపోగానే తిన్నగా వాళ్ళవూరు వచ్చెయ్యమని రాసిందట. అందుకే శ్రీదేవి మా పెళ్ళివిషయం నాన్నగారితో వెంటనే ప్రస్తావించమంది. నాన్న అనుమతిస్తే నాగురించి వాళ్ళ అమ్మగారికి తెలియజేస్తానంది. ఉదయం లేచినప్పటినుండి ఇవే ఆలోచనలతో మనసు సతమతమవుతుంది.

ఖాళీచేసిన కప్పుని టేబిల్ మీద పెట్టాను. చేతి గడియారం కేసి చూశాను. సరిగ్గా ఏడయింది. కాలేజికి ఇంకో అరగంట వ్యవధివుంది. ఆరోజుకి కావలసిన పుస్తకాలు తీసి బయట పెట్టాను.

ఇంతలో రంగన్న వచ్చి, 'చినబాబుగారూ! మిమ్మల్ని నాన్నగారు ఒకసారి రమ్మన్నారు' చెప్పాడు.

'ఇదిగో వస్తున్నానని చెప్పు.'

రంగన్న అక్కడినుండి వెళ్ళిపోయాడు. అద్దం ముందుకువెళ్ళి తల దువ్వుకున్నాను. కులాసాగా నాన్నగారిగదిలో అడుగుపెట్టాను. ఎన్నడూ లేనిది ఆయన అదోలా వున్నారు. నాన్నగారిని ఆస్థితిలో చూసేసరికి నాకేమీ పాలుపోలేదు. పడకమీద వీపు తలగడకు ఆన్చి కూర్చున్నారు. రోజూవున్న ఉత్సాహము లేశమాత్రమైనా లేవు. మనిషి నీరసంగా అదోలా వున్నారు. ఎప్పుడూ చిరునవ్వుతో కళకళలాడే ఆయన మొహం పేలగా వుంది.

'ఏం నాన్నా! ఒంట్లో బాగులేదా?' పక్కన కూర్చుంటూ అడిగాను.

ఆయన మెల్లిగా మూలిగారు.

'అవును రాము! రాత్రినుండి జ్వరంగా వుంది. తల కూడ బాధ పెడుతుంది.'

'డాక్టరుకి కబురు చేయనా? నాన్నా!'

'ఈమాత్రానికి డాక్టరు ఎందుకు? అదే తగ్గిపోతుందిలే. కాని ఈవేళ కాలు బయటకు కదిపే ఓపిక లేదు. నేను ఆఫీసుకి వెళ్ళకపోతే ఆగుమస్తాలు ఏపనీ సరిగ్గా చెయ్యరు. భోంచేసిరాగానే కుర్చీలలో కునుకు తీస్తారు. లేదా కూనిరాగాలైనా తీస్తూ కూర్చుంటారు.'

నాన్న చెప్పినది అక్షరాలా నిజం. ఆయన ఆఫీసులో ఒక్క నిమిషం లేకపోతే చాలు వారు చేసేది అంతే!

'చూడు రాము! ఈవేళ కాలేజికి శెలవుపెట్టి ఆఫీసుకి వెళ్ళడం మంచిది, రేపటినుండి యథాప్రకారంగా నేనే వెళ్ళి చూసుకుంటాను.' ఏదో చెప్పకూడని విషయం చెబుతున్నట్టు ఇబ్బందిగా చెప్పారు.



జమూ పిక్చర్స్ వారి ''నా దేశం''లో నల్ల రామమూర్తి, మాలతి, ఎం. కె. విజయ, ప్రభాకర రెడ్డి, ధూళిపాల.

'అలాగే నాన్నా!'

కాసేపు ఆలోచించి ఏదో జ్ఞాపకం వచ్చినట్లు, 'వచ్చే నెలలో నేగా పరీక్షలు. ఈసమయంలో కాలేజికి వెళ్ళక పోతే బావుండదు. ఇవాళకి ఎలాగో జరుగుతుంది. నీవు మామూలుగా కాలేజికి వెళ్లు' అన్నారు.

క్లాసులో ఆరోజు అంత ముఖ్యమైన పాఠాలు ఏవీ లేవు. కోర్సుకూడా అయిపోయింది. మళ్ళీ రివైజ్ చేస్తున్నారు. ఆవిషయమే నాన్నగారితో చెప్పాను.

'ఈరోజు కాలేజికి శెలవుపెడితే ఫర్వాలేదునాన్నా! అంత ముఖ్యమయినపాఠాలు ఏవీ లేవు.'

'నీకెలా తోస్తే అలా చెయ్యి.'

'కాలేజికివెళ్ళి శెలవుపెట్టి వస్తాను. ఈలోపల మీరు లేచి ముఖం కడుక్కోండి. బీరువాలో మాత్రలున్నాయి. కాఫీ త్రాగేముందు వేసుకోండి.'

కాలేజివైపు నడక సాగించాను. ఆలోచనలుమాత్రం మనసుని చుట్టుకుంటున్నాయి. శ్రీదేవి విషయం నాన్నతో మాట్లాడదామని అనుకున్నాను. కాని అనుకోకుండ నాన్నకు ఇలా అయింది. ఈపరిస్థితిలో అటువంటి విషయాలు చర్చించడం అంత సమంజసంగా వుండదు. నాన్నకు స్వస్తత చేకూరాక అడగవచ్చునని మనసుని సమాధానపర్చుకున్నాను. అంతవరకు దేవినికూడ ఆగమని ఒప్పించాలి.

రచన:

శ్రీ యస్సేరావ్.

శ్రీదేవిని ఫస్టు ఇయర్‌లో ప్రేమించాను. ఆమెకి తండ్రి తోబుట్టువులు లేరు. ఒక్క తల్లిమాత్రమే వుంది. చెప్పుకోదగ్గ ఆస్తిపాస్తులు లేకపోయినా తండ్రి సంపాదించి వదలినదానితో జీవిస్తున్నారు. దేవి హాస్టలులో వుంటుంది. తన ఖర్చులకోసం ఆమెతల్లి ప్రతినెల డబ్బు పంపుతుంది. ఈ మూడుసంవత్సరాల పరిచయంలో ఆమె గురించి తెలుసుకున్నది ఇంతే! ఆమె కుటుంబవిషయాలు నేనెప్పుడూ అడగలేదు. ఆ ప్రస్తావన ఎప్పుడూ రానందున ఆమెకూడా చెప్పలేదు.

కాలేజి చేరుకునేసరికి ఏడున్నరయింది. అప్పుడే బెల్ కొట్టారు. స్టూడెంట్సు అంతా క్లాసులకి దారితీస్తున్నారు. ఇంతలో శ్రీదేవి ఆమె స్నేహితురాండ్రతో కన్పించింది. నవ్వుతూ విష్ చేసింది. నన్నుచూసి వాళ్లు తప్పుకున్నారు.

'దేవి! నేనివాళ క్లాసుకి రాను. నాన్నగారికి ఒంట్లో బాగులేదు. ఆఫీసుకి వెళ్ళితీరాలి. ఈపరిస్థితిలో నాన్నగారికి మనవిషయం చెప్పడం అంత బావుండదు. రెండు



కేశినేని మూవీస్ వారి

''బంగారు కుటుంబం''లో

అంజలిదేవి, ఛాయాదేవి.

మూడురోజులు ఓపికపట్టు. సావకాశంగా అంతా చెబుతాను. ఆయన తప్పకుండ ఒప్పుకుంటారు. నీకా భయమక్కర్లేదు. వీలైతే నిన్ను ఆయనకు పరిచయం చేస్తాను.

'ఏమో ప్రసాద్! అవతల అమ్మ చూస్తే అలా తొందర పెడుతుంది. నీవేమో ఎటూ చెప్పవు.'

'నీదంతా పిచ్చినమ్మకం! ఈ రెండురోజుల్లో కొంపలు మునిగిపోవు. మనపెళ్ళి అయిపోయినట్లే అనుకో!'

నామాటలకి ఆమె చిన్నగా నవ్వింది.

'సరే ఇక వెళ్ళు నీకు ఆలస్యమవుతుంది' అని చెప్పి వచ్చేశాను.

... ... ... ...

ఆ రోజు ఆదివారము. నాన్నగారు వరండాలో కూర్చుని పత్రిక తిరగవేస్తున్నారు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేయాలని అనుకున్నాను. ఎదురుగావున్న కుర్చీలో వెళ్ళి కూర్చున్నాను. బల్లమీదున్న మేగజైన్ చేతిలోకి తీసుకున్నాను. పేజీలుమాత్రం తిరగవేస్తున్నాను. సంభాషణ ఎలా ప్రారంభించాలా అని ఆలోచిస్తున్నాను. ఎన్నడూలేనిది ఆరోజు నన్ను భయం ఆవహించింది. తీరా విషయమంతా విన్నాక 'లాభం లేదురా అబ్బాయి' అయన పెదవి విరిస్తే, నేరం చేసినట్టు కోపపడితే ఎదురుతిరిగి చెప్పేంతధైర్యం నాకు లేదు. ఎవరితోనైన వాదించవచ్చు గాని నాన్నవిషయంలోమాత్రం లాభంలేదు.

కాని ఇలా ఎన్నాళ్ళని ఓపిక పట్టడం. పరీక్షలకి పట్టుమని పదిహేనురోజులైనా లేవు. ఇంకో నెలరోజులు దాటితే దేవి వెళ్లిపోతుంది, నాకు దూరమవుతుంది అలా జరగడానికి వీల్లేదు. ఇలాంటిసమయంలో ధైర్యం వహించి తీరాలి.

'నాన్నా!' ధైర్యంచేసి పిలిచాను.

'వూఁ' తల ఎత్తకుండానే పలికారు.

'నా పెళ్ళివిషయమై మీతో ఒకవిషయం చెప్పాలని ...' అంతవరకువచ్చి ఆగిపోయింది శబ్దం.

చదవడం ఆపి పుస్తకం ఒళ్ళో పెట్టుకుని, 'ఫర్వాలేదు చెప్పు. నీఅభిప్రాయం నాకుకూడ తెలుసుకోవాలని వుంది.'

నాన్న ఆమాట అనేసరికి వెయ్యేనుగులబలం వచ్చినంత ధైర్యం కలిగింది. ఆయనవైపుచూసి చెప్పే ధైర్యం లేక నేలచూపులుచూస్తూ చెప్పాను.

'మా కాలేజిలో ఒక అమ్మాయిని ప్రేమించాను. అందంగా వుంటుంది. ముఖ్యంగా ఆమె చాలా మంచి పిల్ల నాన్నా! ఆమెఅంటే ప్రతి ఒక్కరికి సదభిప్రాయం వుంది. లెక్చరర్స్ సహితం ఆమె నడవడికను మెచ్చుకుంటారు. ఈవిషయం మీతో ముందుగా చెప్పలేనందుకు క్షమించండి. నన్ను ఎక్కడ తప్పుగా అర్థం చేసుకుంటారోనని భయపడి చెప్పలేదు. మీరు సరేనంటే ఆమెను ఒకసారి తీసుకవస్తాను. చూస్తే మీకే తెలుస్తుంది.

తల ఎత్తి నాన్నగారివైపు చూశాను. గుండెలు ఒకసారిగ ఝల్లుమన్నాయి. నాన్నముఖం అదోలా చిన్నబోయింది. నావైపు జాలిగా చూస్తూ వుండిపోయారు. కాసేపు మౌనంగా! నాలోని ఆవేదన క్షణక్షణం అధికమిస్తోంది. ఆయన నోటినుండి ఏం వినాల్సివస్తుందో! గుండెలు వేగంగా కొట్టుకోవడం ప్రారంభించాయి.

'తొందరపడ్డావు రాము! నీ పెళ్ళి ఇంతకుముందే నిర్ణయమయిపోయింది.'

ఆమాటలు నా చెవులకి పిడుగుపాటులా ధ్వనించాయి. గదంతా గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది.

ఆయన మళ్లీ చెప్పడం మొదలెట్టారు. రెండుమూడు నెలలనుండి ఈవిషయం నీతో చెబుదామని అనుకుంటూనే వున్నాను. ఆవిషయం ప్రస్తావించాలని అనుకున్నప్పుడల్లా నీవు ఏదో వంక పెట్టుకుని తప్పించుకు తిరిగావు. నీకు ఇష్టంలేనప్పుడు ఎందుకు చెప్పడమని వూరుకున్నాను. మొన్న నీవన్నట్టుగా పరీక్షలయ్యాక అంతా వివరంగా చెబుదామని అనుకున్నాను. ఈసంగతి తెలియక నీవు తొందరపడ్డావు. అమ్మాయి ఎవరోకాదు. మీ అత్తయ్య కూతురు లక్ష్మి. బహుశా నీకు గుర్తుండదు. అప్పుడు నీకు ఆరేళ్ళు వుంటాయి. అప్పట్లో మీ మావ అత్తయ్య మన ఇంటిలోనే వుండేవారు. వారు లేమిలో వుండడం చేత నాసంపాదనమీదే బ్రతుకుతూవచ్చారు. వారిద్దరు నిన్ను ఎంతోప్రేమగా చూసుకునేవారు. మీ అత్తయ్య మాత్రం నిన్ను ఒక్కక్షణం విడిచివుండేది కాదు. 'రాము' అని ఎంతో లాలనగా పిలిచేది. ఒకరోజు నేనింట్లో లేనిసమయంలో మీ అమ్మకు అత్తయ్యకు ఏదో కారణంగా చిన్న గొడవ వచ్చింది. మీ అమ్మ కొంచెం ముక్కోపి. ఆవేశంలో అత్తయ్యను, 'గతిలేక మాపంచన చేరి బ్రతుకుతున్నారు' అని అనేసింది. మీ అత్తయ్య

అంతగా బాధపడలేదు. కాని మీ మావయ్యమాత్రం చాల బాధపడ్డారు. ఆకారణంగా కుటుంబాలు వేర్పడ్డాయి. ఎవరితోనూ చెప్పకుండ వారు ఎటో వెళ్ళిపోయారు. ఆవిషయం తెలిసి మీ అమ్మ ఎంతగానో ఏడ్చింది. తను చేసిన పొరపాటుకి బాధపడింది. నిన్ను మీ అత్తయ్య ఎంత ప్రేమగా చూసేదో – అమ్మ లక్ష్మిని అంతకంటె పదిరెట్లు బాగుగా చూసింది. లక్ష్మిని మన ఇంటికోడలు చేసుకుందామని నాతో చెప్పేది. అందువలన ఆ లక్ష్మిని దూరంకావడంతో మీ అమ్మ మంచం పట్టింది. వారికోసం చాలచోట్ల వాకబు చేశాను. కాని ప్రయోజనం లేకపోయింది. మీ అమ్మను ఎందరో డాక్టర్లకు చూపించాను. కాని ఫలితం లేకపోయింది. నిద్రలో ఎప్పుడూ 'లక్ష్మి, లక్ష్మి' అని కలవరించేది. మీ మావ అత్తయ్యల జాడ తెలిస్తే వారిని మళ్ళీ దూరం చెయ్యవద్దన్నది. లక్ష్మిని మన ఇంటికోడలుగా చేయాలని మాట తీసుకుంది. ఒకవేళ నీవు తిరస్కరిస్తే తన ఆత్మకు శాంతి లభించదని చెప్పింది. చనిపోయినముందు నీపేరన మీ అమ్మ ఒక వుత్తరంకూడ రాసింది. వారిజాడ తెలిసినట్టయితే నీకు అన్నీ వివరించి ఒప్పించమంది. ఒకవేళ నీవు నిరాకరిస్తే ఆ వుత్తరం నీకు చూపించమన్నది. నా మాట మీద నీకు నమ్మకంలేకపోతే ఆవుత్తరం తెస్తానుండు' అని లేచి లోపలకు వెళ్ళారు.

నా ఆశయాలు ఆఖరుకి ఇలా ఎదురుతిరిగాయి. శ్రీదేవి తన సర్వస్వం నేనేనని నమ్ముకుంది. ఆమెనికాదని మరొకర్ని పెళ్లాడితే నేను జీవించలేను. నాన్న చెప్పినదానికి సమ్మతించి దేనికి ద్రోహం చేయడమా! ఈవిషయం ఆమెతో ఎలా చెప్పను? చెబితే ఆమె ఏమైపోతుందో! గుండెలు వేగంగా కొట్టుకోవడం ఆరంభించాయి.

'ఇదిగో ఆ వుత్తరం!' అంటూ నాన్న నాచేతికి మడతపెట్టిన ఒక కాగితం ఇచ్చారు.

ఆత్రుతగా విప్పిచూశాను, తారీఖునుబట్టి ఆలేఖ పదేనిమిదేళ్లక్రితం రాసిందని గ్రహించాను. అందులో ఆలా వుంది.

చిరంజీవి రాం ప్రసాద్‌కి,

బాబూ! నీకష్టసుఖాలు కనిపెట్టే భాగ్యం భగవంతుడు నాకు ప్రసాదించలేదు. నీ భవిష్యత్తును మీ నాన్నగారిచేతుల్లో పెడుతున్నాను. వారి ఆశయాలకు అనుగుణంగా నీవు పెరిగి పెద్దవాడివవుతావనే నమ్మకం నాకు వుంది. నిన్ను ఎంతో అల్లారుముద్దుగా చూసుకున్న మీ అత్త మావయ్యలను దూరం చేసుకున్నాను. నేను లక్ష్మిని మన ఇంటికోడలుగా చేసుకుందామని ఆశించాను. కాని లక్ష్మిని చేజేతులా నేనే దూరం చేసుకున్నాను. భగవంతుని అనుగ్రహంవలన వారు తిరిగి మీకు కలుస్తారని ఎందుకో నామనసు చెబుతుంది. ఒకవేళ అదే నిజమైతే లక్ష్మిని నీ అర్ధాంగిగా చేసుకోమని కోరుతున్నాను. నా కోరికను నీవు గౌరవించి తప్పక నెరవేరుస్తావనే నమ్మకంతో నే కళ్లు మూస్తున్నాను. నీవలా చేసినట్లయితే నేనెక్కడున్నా నా ఆత్మకు శాంతి లభిస్తుంది.

ఆశీస్సులతో

—మీ అమ్మ.

చదువుతున్నంతసేపు కళ్లవెమ్మట నీళ్ళు వెచ్చగా జారాయి. అమ్మ స్వయంగా ప్రత్యక్షమై చెబుతున్నట్టు అనిపించింది.

నేనేంచెయ్యాలి? అమ్మ ఆత్మశాంతికోసం లక్ష్మిని పెళ్ళాడటమా? లేక తన సర్వస్వం నాకర్పించి నన్నే నమ్ముకుని ఆశలు పెంచుకుని శ్రీదేవిని పెళ్ళాడమా? 'భగవాన్! ఏమిటీ సమస్య!' ఎటూ నిర్ణయించుకోలేని పరిస్థితితో మనసు జివ్వుమంది.

నాన్న మళ్ళీ ఇలా చెప్పడం ప్రారంభించారు, 'మూడునెలలక్రితం మీ అత్తయ్యవాళ్ల జాడ తెలిసింది. మీ మావగారు ఆరేళ్ళక్రితం పోయారట ..'

ఆయన ఇంకా చెప్పడం ముగించకముందే ఆవేశంలో నేను ఇలా అన్నాను. 'నాన్నా! ఆమెనుతప్ప మరొకరిని చేసుకోనని మాట ఇచ్చాను. ఆమెకూడ తన సర్వస్వం నేనేనని నమ్ముకుంది. ఆమెకు ద్రోహంచెయ్యడం భాగ్యమేనంటారా? చెప్పండి' ఎక్కడలేని దుఃఖం పొంగుకొచ్చేసింది.

'చూడు రామూ! ఇందులో నా బలవంతమేమీ లేదు. మీ అమ్మ ఆత్మకు శాంతిని చేకూర్చాలని వుంటే ఆమె కోరికను నెరవేర్చు. లేదంటే నీ ఇష్టం. నీవు ఎలా చెయ్యమంటే అలా చేస్తాను.'

నాబాధను చూడలేక ఆయన కళ్లు చెమర్చాయి.

వయసు తెలిసాక నాన్నను ఆ పరిస్థితిలో చూడటం అదే మొదటిసారి. అమ్మరాసిన వుత్తరం పదేపదే చెవుల్లో గింగురుమంటుంది. అమ్మ చేతులమీద పెరిగే అదృష్టానికి నేను నోచుకోలేదు. ఆమె కడసారికోరిక తీర్చడం నాకర్తవ్యం. అంతకన్నా ఆలోచించే శక్తి నామనసుకి లేకపోయింది.

'సరే! అమ్మ ఇష్టప్రకారం కానీయండి. నేను కూడ అదే నిర్ణయించుకున్నాను.'

'ఒక్కమాట. నేను రేపే వాళ్ళవూరు వెళ్లొస్తాను. పరీక్ష లయినవెంటనే ముహూర్తం పెట్టిస్తాను. నీకు ఇష్టమేనా?'

'అలాగే కానీయండి.'

'ఏమిటి ప్రసాద్! ఇవ్వాళ అదోలా వున్నావు?' రావడంతో అడిగింది దేవి.

'విధి మనల్ని చూసి ఓర్వలేకపోయింది దేవీ! నీకీ విషయం ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు. ఈక్షణం నుండి నన్ను మర్చిపో! నామనసు నీకు తెలుసు. నీకిలా దూరం కావలసివస్తుందని కలలోకూడ అనుకోలేదు. నిన్ను నాదానిగా పొందలేని దురదృష్టవంతుడ్ని.'

'ఏమిటి ప్రసాద్! నీవంటున్నది.'

'ఏమని చెప్పను దేవీ! నేను చెప్పేది నీకు కల్పితంగా వుంటుంది. ఎదురుచూడని పరిణామానికి దారి తీసింది నా జీవితం. నాహృదయంనుండి నిన్ను బలవంతంగా దూరం చేసి మరొకర్ని చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క విషయంమాత్రం చెప్పగలను. నాపెళ్ళి చిన్నప్పుడే నిర్ణయమయింది. నిన్నటివరకు ఈవిషయం నాకు తెలియదు. నిన్న మనవిషయం నాన్నగారితో చెప్పాను. అప్పుడు ఆయన ఇదంతా చెప్పారు. అమ్మ చనిపోయే ముందు నిర్ణయించిన సంబంధమిది. కాదనే ధైర్యం నాకు లేకపోయింది. నన్ను క్షమించు దేవీ!'

ఆమె కళ్ళనుండి కన్నీళ్లు జలజలా రాలాయి. ఎప్పుడూ చిరునగవుతో కనిపించే శ్రీదేవిని ఆస్థితిలో చూడాల్సివస్తుందని ఎన్నడూ అనుకోలేదు. ఆమె పెదవులు వణికాయి. 'ఎవర్ని అని ఏం లాభం! విధి అనుకూలించలేనప్పుడు మనం ఆశయాలు ఎదురుతిరగడం సహజం. విధి చేతిలో మనం కీలుబొమ్మలం, నిన్నుపొందే అదృష్టం లేదని సరిపుచ్చుకుంటాను. నాతలరాత ఎలావుంటే అలా జరుగుతుంది. నాకోసం నీవు బాధపడకు.'

'నిన్నుకాదని నేనుమాత్రం సుఖపడగలనా దేవీ! నేనెక్కడున్నా ఏమిచేసినా నీ తలంపుతోనే బ్రతుకుతాను. నాహృదయంలో నిన్ను ఎప్పుడూ ఆరాధిస్తూనే వుంటాను.'

'వద్దు ప్రసాద్! అలా చెయ్యొద్దు. నిన్ను నమ్ముకుని కలకాలం నీ ఆనందాన్ని పంచుకోవాలని వస్తున్న అర్ధాంగిని నిరాశలో ముంచివేయకు. ఆ ఇల్లాలి మనసు బాధపడితే ఆ వుసురు నాకు తగులుతుంది. ఇప్పటినుండి నీకు నేను ఏమీ కాను. నీవైన చల్లగా బ్రతుకు వస్తాను.' చకచకా అడుగులు వేసుకుంటూ ముందుకు దాకితీసింది.

'భగవాన్! ఆమెను కాపాడేభారం నీదే!' మనసులోనే ప్రార్థించాను.

* * * *

నాగది నూతనవస్తువులతో అలంకరించబడింది. గదిలోవున్న అన్నివస్తువులు మార్చేశారు. మంచంచుట్టూ మల్లెమొగ్గలు వేలాడగట్టారు. గది నలువైపులా సువాసనలు వెదజల్లుతున్నాయి. మంచం ప్రక్కనేవున్న టేబిలు పళ్లు ఫలహారాలతో నిండియున్నది. గడియారం కేసి చూశాను. తొమ్మిది దాటింది.

పెళ్ళిలో ఏం జరిగిందో నాకు అంతగా గుర్తులేదు. నన్ను పెళ్ళికొడుకునిచేసి పెళ్ళిపీటలమీద కూర్చోబెట్టారు. ముహూర్తంవేళకు మేనిముసుగులోనున్న పెండ్లికూతుర్ని నా పక్కపీటమీద కూర్చోబెట్టారు. శాస్త్రులు మంత్రాలు చదివారు. తాళికట్టి మూడుముళ్ళు వేశాను. అన్నీ యాంత్రికంగా జరిగిపోయాయి. స్నేహితులు, బంధువులు, ఇంకా ఎవరెవరో వచ్చి శుభాకాంక్షలు అందజేశారు. అవేమీ నాకు గుర్తులేదు.

మొత్తంమీద ఎలా అయితేనేం అమ్మ ఆదేశించినట్టు అత్తకూతుర్నే పెళ్ళాడాను. అమ్మ ఆత్మకు ఎంత శాంతి లభించిందో!

శ్రీదేవితో ఆనందంగా గడపాలనుకున్న ఈ తొలిరేయి! కోరుకున్న ఆ తొలిరేయి వచ్చింది-కాని శ్రీదేవి మాత్రం లేదు! దేవి గుర్తుకి రాగానే దుఃఖం పొంగుకొచ్చినట్టయింది.

ఇంతలో గుమ్మంవద్ద కిలకిలా నవ్వులు వినిపించాయి. తలుపులు మెల్లిగా తెరుచుకున్నాయి. మేలిముసుగులోనున్న లక్ష్మిని లోపలకు నెట్టారు. తలుపులు యథావిధిగా మూసుకున్నాయి. ఆమె తలవంచుకుని మెల్లగావచ్చి మంచంవద్దకు చేరింది. పైకిలేచి ఆమెను హృదయానికి హత్తుకోవాలనుకున్నాను. కాని మనస్కొప్పలేదు. అలాగే మంచానికి అతుక్కుపోయాను. కాసేపట్లో నిద్ర పట్టేసింది. అలా ఎంతసేపు నిద్రపోయానో తెలీదు.

నా కాళ్ళమీద ఏదో స్పర్శ చల్లగా తగిలింది. ఉలిక్కిపడి లేచాను. టైం పదకొండు కావస్తుంది, లక్ష్మి నా కాళ్ళవద్ద తల ఆన్చి పడుకుంది. ఆమెను ఆస్థితిలో చూడటంతో జాలేసింది. నాబాధలో పాలు పంచడానికి ఇష్టంలేదు పాపం! ఎన్నికోరికలతో అడుగుపెట్టిందో ఆమె! మనసు ఇది తప్పు అని హెచ్చరించడంతో మెల్లిగా లేచాను. భుజాలు పట్టుకుని ఆమెను మెల్లిగా ఎత్తాను. లక్ష్మి ఇంకా మేలిముసుగుతోనే వుంది. వణుకుతున్న చేతులతో ముసుగు మెల్లిగా తొలిగించాను. నా కళ్లు ఒక్కసారిగా అదిరినట్టయ్యాయి. నా ఆశ్చర్యానికి అంతులేదు.

కలా! నిజమా?

ఆమె లక్ష్మికాదు. నా ఆరాధ్యదేవత-శ్రీదేవి!

సంతోషంతో గట్టిగా అరవాలనిపించింది.

ఆమె మూసుకున్న కళ్లు ఇంకా విప్పలేదు. కళ్ళనుండి కన్నీరు జలజలా కారుస్తుంది. ఏదో చెప్పాలనుకున్నాను.

'దేవీ!' అనిమాత్రం అనగలిగాను.